



ఎంత రాజుగారి అబ్బాయి అయినా అతనో గురువుగారికి శిష్యుడిగా ముద్ర వేయించుకోవాల్సిందే. రాజు కొడుకుననే డాబూ, దర్పం ఎక్కడ ప్రదర్శించినా గురువుగారి దగ్గర మాత్రం చేతులు కట్టుకు నిలబడాలి. గురువర్యా అని భక్తితో పిలవాలి. ఆ రోజులలో గురుకులాలుండేవి. అక్కడచేరి గుర్రా లెక్కడం, కత్తియుద్ధాలు చేయడం, కుస్తీలు పట్టడం నేర్చుకుంటూనే నాలుగక్షర ముక్కలు కూడా వంట పట్టించుకునేవాళ్ళు. రాజుగారి కొడుక్కి సకలశాస్త్రాలూ బోధించి పవర్‌ఫుల్ కింగుగా నిలబెట్టేవారు గురువులు. ఆ విధంగా వాళ్ళు కింగ్ మేకర్సుగా కీర్తి గడించేరు. ఆ రోజులలో గురువు రాజుకంటే గొప్పవాడు. దైవాంశ సంభూతుడు. జాతిరత్నాలు వారి చేతుల లోనే మెరుగులు దిద్దుకునేవి. సామాన్యుడికి గురుకులంలో చోటుండేదో

లేదో నాకు తెలీదు. ఏది ఏమైనా ఆనాటి ఆచార్య పదవి ఆహా అనిపించేలా వుండేది. వదిలేయండి.

రకరకాల ఉద్యోగాలున్నాయి. ఉద్యోగాలన్నీ కూడా ఉదర పోషణ నిమిత్తమేనని రూలింగిచ్చేస్తే నేనుఅంగీకరించను. కొన్ని ఉద్యోగాలు లోక కళ్యాణంకోసం ఉద్దేశింపబడి వుంటాయి. వాటిల్లో ఉపాధ్యాయ వృత్తి ప్రముఖంగా నిలుస్తుంది. ఉపాధ్యాయుడు కూడా బతకాలి గనక జీతం తీసుకుంటున్నాడు. అంతేగాని జీతం కోసమే ఈ వృత్తి స్వీకరించేనని ఏ టీచరైనా మీటింగు పెడితే నాకు గొప్ప దుఃఖంగా వుంటుంది. తల్లి, తండ్రి, గురువన్నారు. ఈ ముగ్గుర్నీ దైవ సమానులుగా భావించమన్నారు. కంటికగపించే దేవుళ్ళుగా ఉంచుకోమన్నారు. మంచి పౌరులతో దేశం నిండిపోవాలంటే మంచి తల్లిదండ్రులతోపాటు మంచి టీచరు కూడా ఎంతో అవసరం. గురుకులాల్లో గురువులు గురుదేవోభవగా వర్తిల్లేరు. రాను రాను గురుకులాలు పోయేయి. గురువులుపోయేరు. బతకలేక బడి పంతుళ్ళు వెలిసేరు. దసరా రోజుల్లో మామూళ్ళ వేటకి విల్లంబులు పిల్లలకిచ్చి వీధుల పాలవుతున్నారు.

బడిపంతుళ్ళను కించపరచాలనే ఉద్దేశం నాకులేదు. నా గురువులు ఉద్దండులు. ఇవాళ తెల్లకాగితమ్మీద నాలుగక్షరాలు రాస్తున్నానంటే అదంతా వాళ్ళ భిక్ష. నా గురువులలో కొందరు కీర్తిశేషు లయ్యేరు: కొందరు వృద్ధు లయ్యేరు. అనుక్షణం తలచుకుంటున్నానని అబద్ధం చెప్పనుగాని రోజుకోతడవైనా ఆ మహనీయులను తలుచుకోడం నాకు అలవాటు. వాళ్ళు కనిపిస్తే సాష్టాంగ నమస్కారాలు చేయకపోవచ్చు. మనసారా చేతులు జోడిస్తాను. మీ ఆశీస్సులు కావాలని అర్థిస్తాను. గురువులపట్ల ఇంత భక్తి పెంచుకున్న వాణ్ణి అకారణంగా ఆ కులాన్ని తిట్టి పోయలేను.

ఈ మధ్య ఎక్కడో చదివేను. క్లాసులో పాఠం చెబుతూ ఆగిపోయి నా పాఠం వినకుండా క్లాసులో ఆడపిల్లల్ని ఆకలిగా చూడటం తప్పని ఒక కుర్రాణ్ణి చ్ఛరించి హెచ్చె లెక్చరరు. నేను మిమ్మల్నే చూస్తూ మీ పాఠమే వింటున్నాను. కాని తమరు ఆడపిల్లల బెంచీకి అతుక్కుపోయేరు. గనక

నాచూపు కూడాఅక్కడే నిలిచిందని స్టూడెంటు సమాధానం చెప్పేట్ట. గురువుగారు మంచికి మార్గదర్శి కావాలేగాని పిచ్చి చేష్టలకు లొంగిపోతే జరిగే అనర్థాలు చాలా ఉంటాయి. నేటి బాలలే రేపటి పౌరులన్నారు. నేటి బాలలమీద టీచర్ల ప్రభావం ఎంతైనా వుంది: వుంటుంది. విద్యార్థిలో క్రమ శిక్షణ పెంచడం ఉపాధ్యాయుడి ప్రథమ కర్తవ్యం. అంతుకోసం తాను క్రమశిక్షణని ఆరో ప్రాణంగా ఎంచుకోవాలి. తన వ్యసనాలు చిల్లర సరదాలూ, విద్యార్థి దృష్టిలో పడకుండా జాగ్రత్త పడాలి. అప్పుడుగాని సదరు టీచరు మీద స్టూడెంటుకి గురీ, గౌరవాలు ఏర్పడవు. గురీ గౌరవాలు దూరమైన తర్వాత టీచరెంతో, ఎదుటవున్న నల్లబల్ల కూడా అంతే.

గాంధీ, నెహ్రూలను యుగపురుషులుగా ఎంచుకుంటున్నాం. దండలు వేసి మన భక్తి భావాల్ని చాటుకుంటున్నాం. వాళ్ళ గురువు లెవ్వరో తెలీదు. నన్నడుగుతే దండలు ఆ గురువులక్కూడా వేయాలి. నాతోపాటు చదువుకుని లెక్చరర్లుగా స్థిరపడ్డ మిత్రులు కొందరున్నారు. వాళ్ళ లీలా విలాసాలు నాకు తెలుసు. మీరట్లా వెలిగిపోవడం మంచిది కాదంటాను. నోరు మూసుకోమంటున్నారు వాళ్ళు. నేను చీట్లపేక ఆడినా, విస్కీ పుచ్చుకున్నా దానివల్ల సంఘం నష్టపోయేది బహు తక్కువ. ఆపద అస్సలు లేదు. మేస్టర్లు సిగరెట్లు కూడా కాల్చకూడదని సొంత అభిప్రాయం. ఆ వృత్తిలో అడుగుపెట్టగానే ఈ సరదాలకు స్వస్తి పలకాలి. ఒక క్రీస్తులాగా జీవితాన్ని లాగించాలి. తాను పవిత్రంగా వుంటేనే తప్ప స్టూడెంటు దారిలోకి రాడు.

నేను చూసిన సంఘటన యిక్కడ తప్పని సరిగా రాయాలి. వాళ్ళు మొత్తం నలుగురు. ఇంచుమించు అందరిదీ ఒకే ఈడు. బాగా తాగి వున్నారు. ముదురు జోకులు వేసుకుంటున్నారు. పకపకా నవ్వేసుకుంటున్నారు. ఒకే సిగరెట్ నలుగురు కాల్చేసుకుంటున్నారు. మంచి ఫ్రెండ్స్ అనుకున్నాను. ఆ నలుగుర్లో ఒక వ్యక్తి లెక్చరరని నా పక్కనున్న మనిషి చెప్పేడు. మిగతా ముగ్గురూ అతని స్టూడెంట్సట. స్టూడెంట్స్‌తో చనువుగా వుంటే నేరం కానేకాదు. ఆ మాటకొస్తే చనువుగా వుండాలి కూడాను. ఆ చనువు తాగుడువరకూ వెళ్ళిపోతే ఆచార్య పీఠానికే అవమానం. క్లాసులో అతనేం పాఠాలు చెబుతున్నాడో నాకనవసరం. నడిరోడ్డుమీద స్టూడెంట్‌తో

పాటు తాగి, తందనా లాడటం కూడా క్రమశిక్షణలో ఒక భాగమేనని పేర్కొంటే ఆ భాష్యానికో నమస్కారం.

చదువుకునేవాడూ, చదువు చెప్పేవాడూ ఇద్దరూ యించుమించు ఒకే వయస్సు కావడంవల్ల నువ్వు నా బ్రదర్‌వి అంటాడు గురుడు. అంతకంటేనా బ్రదరూ అంటాడు శిష్యుడు. ఇవాళ ప్రోగ్రామేమిటని అడుగుతాడు టీచరు. పంచవటి బారంటాడు స్టూడెంట్. ఆరోజు ఆ స్టూడెంట్ ఖర్చుమీద పీకల దాకా తాగేస్తాడు ఆచార్యుడు. మరో రోజు మరో శిష్యుడు. ఇంకో రోజు ఇంకో అర్భకుడు. ఇట్లా నెల పొడుగూతా వంతు లేసుకుని తాగి, సరదాలు తీర్చుకునే మహాశయుడు గురుదేవోభవ అనేందుకు అనర్హుడు. వీళ్లు పేకలో కపుంట్లు పడిపోతాడు. క్లాసుకొచ్చి చిరాకు పడతాడు. రాత్రంతా తెగ తాగుతాడు. హేంగవర్లో తనకి తోచిందేదో క్లాసులో చెబుతాడు.

పరీక్ష రోజులు దినదిన గండంగా వుంటాయని వింటున్నాం. కలాల్లో సిరా వున్నా లేకపోయినా కత్తులా, చాకులా తీసుకుని విద్యార్థులు పరీక్ష కొస్తున్నారు. పరీక్ష పేపర్లు మార్కెట్లో కూరగాయల్లా అమ్మకాలూ, కాపీ కొట్టడం మామూలై పోతున్నాయి. విద్యా వ్యవస్థ ఎక్కడికి పడిపోతుందో అనూహ్య మవుతోంది. దీని కెవరు బాధ్యులని ప్రశ్నవేస్తే సవాలక్ష రకాల సమాధానాలు వస్తున్నాయి. ఇదిచాలనన్నట్టు ఉపాధ్యాయుల ప్రవర్తన ఆందోళనకరంగా పరిణమిస్తోంది. నేను మార్కెట్లో ఎట్లా ఏడ్చినా గొడవ లేదు. టీచరైం తర్వాత క్లాసు రూమూ, నడిబజారూ రెండుచోట్లా కొన్ని కట్టుబాట్లతో వ్యవహరించాలి. టీచరు గూడా నీలాంటి మనిషే. అతనికీ నీలాంటి సరదా లుంటాయి. నీలాగా తాగా లనుకుంటాడు. నీలాగా తిరగాలనుకుంటాడు. దీన్లో తప్పేమిటని ఎదురు ప్రశ్నవేస్తే నా దగ్గర సమాధానం లేదు.